22న మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ 22వ వార్షికోత్సవాన్ని ఈనెల 22న నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీ స్థాపించి 21 ఏళ్ల పూర్తి చేసుకుని 22వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రత్యేక భక్తి సంగీత 'స్వరార్చన' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, నందినిల పర్యవేక్షణలో ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకలు కొంపల్లి కండ్లకోయలోని కృష్ణ సదన్ (ఓల్డేజ్ హోమ్) ఉంటాయని చెప్పారు.

బీజేపీలో ఓబీసీల పాత్ర కీలకం


బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌ను కలిసిన ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: ఓబీసీల హక్కులు, సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందించాల్సిన అవసరముందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి సంతోష్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలోని పార్టీ జాతీయ కార్యాలయంలో కలిసి ఓబీసీలు పార్టీకి అందిస్తున్న సేవలను ఆయనకు వివరించారు. తెలంగాణలో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల కేటగిరీ మార్చకుంటే ఉద్యమమే



సమావేశంలో మాట్లాడుతున్న పి.నారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాటర్ వర్క్స్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కేటగిరీ మార్చి వారికి జీతాలు పెంచాలని.. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌అండ్‌ఎస్‌బీ యూనియన్ అధ్యక్షుడు నారాయణ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాటర్ వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. 2023 ఆగస్టులో జీఓ 60 ద్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేటగిరీ 2లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరీ వన్‌లో చేర్చడం వల్ల ప్రతి కార్మికుడు నెలకు రూ.4వేలు నష్టపోతున్నారని అన్నారు. అధికారుల తప్పిదాన్ని సరిదిద్ది కేటగిరీ మార్చి జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కురుమల చైతన్యాన్ని ఓర్వలేకే బద్రీనాథ్ అసంబద్ధ వ్యాఖ్యలు'

అంబర్‌పేట: రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులు అవుతున్న కురుమ కులస్తులను చూసి యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు బద్రీనాథ్ యాదవ్ అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం దారుణమని కురుమ సంఘం గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షుడు రావుల సుధాకర్ మండిపడ్డారు. కురుమల కంటే తక్కువ జనాభా ఉన్న యాదవ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా బలపడుతూ తిరిగి తమపైనే ఆరోపణలు చేయడం ఏమిటని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. గొల్ల కురుమలు సంకర జాతి అని బద్రీనాథ్ వ్యాఖ్యలు చేయడం ఆయన దివాలాకోరు తనానికి నిదర్శనమని అన్నారు. ఇటీవల కోకాపేటలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆత్మగౌరవం భవనాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. అక్కడి సభ విజయవంతం కావడంతో ఓర్చుకోలేని బద్రీనాథ్ యాదవ్ కురుమ కులస్తులపై అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్‌లో చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పదవులు కోసం స్వార్థపూరితంగా ప్రచారం చేసుకోవడం తగదన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు ఢీకొని ముగ్గురు మృతి

కాచిగూడ: రైలు ఢీకొని వివిధ ప్రాంతాల్లో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శివరాంపల్లి – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహం కొంతమేర కుళ్లిపోయింది. గుర్తుతెలియని వ్యక్తి (40) శివరాంపల్లి – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని ఒంటిపైన లైట్ పింక్‌కలర్, బ్రౌన్ కలర్ షర్టు, యాష్ కలర్ ప్యాంట్ ఉంది. మరో ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి (50) బుద్వేల్ – ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాల్సిందే..

- ధర్నా చౌక్ వద్ద మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చిన కార్మికులు
- వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్
- గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి
- వేతన బకాయిల చెల్లింపులో జాప్యం వద్దు
- జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలి

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల డిమాండ్


ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు భారీగా హాజరైన గ్రామపంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ, కారోబార్, బిల్ కలెక్టర్ సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. జీఓ నం.60 ప్రకారం వేతనాల చెల్లింపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, స్పెషల్ స్టేటస్, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు.

మొదట అనుమతి ఇచ్చి తర్వాత రద్దు చేసి..

మొదట సెంట్రల్ జోన్ డీసీపీ ధర్నాకు అనుమతి ఇవ్వడంతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు వేలాదిగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌కు తరలివచ్చారు. అనంతరం సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఉన్నపలంగా అనుమతిని రద్దు చేయడంతో మంగళవారం ఉదయం వివిధ జిల్లాల నుంచి వచ్చిన గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. కార్మికులు వేలాదిగా తరలి రావడంతో మధ్యాహ్నం 12గంటల తరువాత ధర్నా చేయడానికి అనుమతినిచ్చారు.

మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి..

తెలంగాణ రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీలలో సుమారు 60వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డ్రైవర్లు, ఆఫీసు నిర్వహణ, తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 2018లో గత ప్రభుత్వం జీఓ నం. 51ని విడుదల చేసి గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలను రూ.8500లకు పెంచిందన్నారు. దీనితో పాటు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ జీవోను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేరుగా కార్మికుడి బ్యాంక్‌ఖాతాలో వేతనం జమచేయాలి..

కేటగిరీల వారీగా వేతనాలను పెంచి కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. బకాయి వేతనాల చెల్లింపులలో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. వేతనాల చెల్లింపునకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి నేరుగా కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్‌సీ పరిధిలోకి గ్రామపంచాయతీ సిబ్బందిని తీసుకొచ్చి జీఓ నం.60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలని అన్నారు.


ధర్నాలో అభివాదం తెలుపుతున్న కార్మిక సంఘాల జేఏసీ నేతలు

సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి..

పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు రూ.5లక్షలు చెల్లించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శిని నియమించి అర్హులైన సిబ్బందికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ ధర్నాలో పీఆర్‌టీయూ గ్రామపంచాయతీ జేఏసీ కన్వీనర్ పాలడుగు భాస్కర్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణ అక్క, శివబాబు, సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకయ్య, సుధాకర్, ఏఐటీయూసీ నాయకులు నర్సింహ, వెంకటరాజంలు హాజరయ్యారు.

డా.బీఆర్.అంబేడ్కర్ అందరివాడు

ఎమ్మెల్యే జి.వివేక్‌వెంకటస్వామి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పిక్టోరియల్ బయోగ్రఫీ అంబేడ్కర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెన్నూరి ఎమ్మెల్యే డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... అంబేడ్కర్ అందరివాడని అయితే కొంత మంది మాత్రం దళిత నాయకుడు అంటూ ప్రచారం చేయడం సరైందికాదన్నారు. అణచివేత ఉన్నచోట అంబేడ్కర్ భావజాలం ఉంటుందన్నారు. ఎంతో ముందుచూపుతోనే రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. నిరంతరం పేదలకోసం తపించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అణగారినవర్గాల వారికి హక్కులను కల్పించిన మహానుభావుడు అంబేడ్కర్ తెలిపారు. మన జాతిని కాపాడుకోవాలనే సంకల్పంతో అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు.

◆ అరుణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ.. ఎవరైతే పీడుతులుగా కొనసాగుతున్నారో వారందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, ఏసీఈ ఇంజనీరింగ్ అకాడమీ చైర్మన్ వైవీ గోపాల కృష్ణమూర్తి, ఆర్‌పీఐ అధ్యక్షుడు బి.మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, రచయిత దుర్గం సుబ్బారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీఎస్‌ఎన్ మూర్తి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పిక్టోరియల్ బయోగ్రఫీ అంబేడ్కర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


అశోక్‌నగర్ చౌరస్తాలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: పాత రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. అశోక్‌నగర్ చౌరస్తా నుంచి బ్రిడ్జ్ వరకు చేపడుతున్న పాత రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె అధికారులతో కలసి పరిశీలించి మాట్లాడారు. అశోక్‌నగర్‌లోని పార్కును సుందరీకరణకు పనులు చేపడుతున్నామని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో పాదచారుల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్ సలాం, వర్క ఇన్‌స్పెక్టర్ మహేష్, నేతలు దామోదర్, ఆకుల సురేందర్, దోనేటి సత్యం, జ్ఞానేశ్వర్, రవీందర్‌గౌడ్, వడ్డేపల్లి ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

కాచిగూడ: పోగొట్టుకున్న బంగారు గొలుసును వెతికి బాధితుడికి అప్పగించిన సంఘటన మంగళవారం నారాయణగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ యం.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన నవీన్ కుమార్ కుమారుడు ఎం.శ్రీకార్తీక్ (17) సోమవారం నారాయణగూడలోని జాహ్నవి కళాశాలకు వస్తున్నాడు. తన మెడలోని రెండు తులాల బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. దీంతో శ్రీకార్తీక్ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ పోలీసులు వెంటనే స్పందించి బర్కత్‌పురలోని శ్రీకార్తీక్ ఇంటి నుంచి నారాయణగూడలోని జాహ్నవి కళాశాల వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. కళాశాల సమీపంలో బంగారు గొలుసు పోగొట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే పోలీసులు గొలుసును వెతికి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ బాధితుడు శ్రీకార్తీక్‌కు నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించిన క్రైమ్ పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. నారాయణగూడ డీఐ డి.నాగార్జున, డీఎస్ఐ జి.వెంకటేష్, అరుణ్ కుమార్, ఎస్.సంతోష్ చారి, ఎం.సురేష్, కె.అభిలాష్, పి.విష్ణు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి శ్రీకార్తీక్‌కు బంగారు గొలుసును అప్పగిస్తున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్

మర్యాదపూర్వక కలయిక

కాచిగూడ: గురుకుల, హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం గురుకుల బాట హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి గుమ్మడి క్రాంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడకు చెందిన గుమ్మడి క్రాంతి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకుల, హాస్టల్ విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. విద్యార్థుల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ, కేలండర్‌ను మంగళవారం ట్రెజరీస్ డైరెక్టర్ కేఎస్‌ఆర్ మూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని డైరీని ఆవిష్కరించామని తెలిపారు. వచ్చే ఏడాది పీఆర్‌సీ సంవత్సరమని ఈ ఏడాది కరువు భత్యం చెల్లించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యక్షులు దేశ్ పాండే, అబ్రహం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, బాలమల్లేష్, అంజయ్య, యాదయ్య, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: శ్రీభద్ర పీఠం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజా తూము లక్ష్మీనరసింహదాసు 191వ ఆరాధన సంగీతోత్సవాలు మంగళవారం ముగిశాయని సంస్థ అధ్యక్షుడు తూము వెంకటరామకృష్ణ తెలిపారు. ఆరాధన సంగీతోత్సవాలు విజయవంతం చేసేందుకు తమవంతు సహకారమందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం శ్రీభద్ర పీఠం కార్యాలయంలో సంగీత విద్వాంసులను సన్మానించారు.

అగ్నిప్రమాదం

అంబర్‌పేట: ప్రేమ్‌నగర్ చౌరస్తాలో స్థానికంగా నివసించే సంధానీ పంక్చర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు సమాచారం మేరకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో పాటు అగ్నిమాపక సిబ్బంది విచ్చేసి మంటలు ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి సందర్శించారు.


ప్రేమ్‌నగర్‌లో దగ్ధమవుతున్న పంక్చర్ దుకాణం

బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి: గుజ్జ సత్యం



కాచిగూడ: బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు.. ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాలకులు బీసీలను పూర్తిగా విస్మరించడంతో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయమే జరిగిందన్నారు. బీసీలకు ఏ రంగంలో వాటా దక్కలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పందించాలన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీలో వివరిస్తూ తీర్మానం ప్రవేశపెట్టాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల సహకారంతో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు పొందని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని రాంనగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఆవుల లోకేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రేటర్ కాంగ్రెస్ యువజన నేత ఎం.అరవింద్‌కుమార్‌కు మంగళవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో అనేక మంది ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం వారికి ఇళ్లను కేటాయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో తస్లీమాబేగం, తమ్రీన్‌బేగం, షాబానాబేగం, రేఖ, ఫాతిమాబేగం, అజర్, సిరాజ్, మజార్, తదితరులు పాల్గొన్నారు.


పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని వినతి పత్రం సమర్పిస్తున్న లోకేష్‌యాదవ్

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై అసెంబ్లీలో చర్చించాలి

ముషీరాబాద్: ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ, ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సర్వేలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. మందులు పారామెడికల్ టెక్నీషియన్స్ కొరత ఉందన్నారు. వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేదని తెలిపారు. ఇలాంటి అంశంపై అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ఎం.రవికుమార్, పీఓడబ్ల్యూ, పీవైఎల్ గ్రేటర్ కార్యదర్శులు వరలక్ష్మి, బీఎస్ కృష్ణ, పుష్ప, సాయి, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ప్రభుత్వమే గ్రంథాలయ ఉద్యోగులకు

వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్

చిక్కడపల్లి: తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా రెండోసారి కొక్కుల దేవేందర్‌ను మంగళవారం ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ... గ్రంథాలయ ఉద్యోగులు, పెనర్లకు వేతనాలు, పింఛన్‌లను ట్రెజరీ నుంచి ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలసి విన్నవిస్తామని అన్నారు. ఉపాధ్యక్షుడిగా పుసుపులేటి నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సోమశివయ్య, కోశాధికారిగా దాచేపల్లి బుచ్చయ్యను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తుమ్మ సత్యనారాయణ తెలిపారు.

నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకొని పేదలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేయాలని చూస్తోందన్నారు. ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విధానం వల్ల పేద విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విద్యా విధానాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వసుపుల మట్టయ్య, గర్ల్స్ కన్వీనర్ సావిత్రి, కోశాధికారి భరత్, పోతుగంటి కాశీ, పి.కుమార్, గడ్డం శ్రీకాంత్, ఇమాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.



ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం నాగార్జున

'మనువాదులే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారు'



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో ప్రజలను చీల్చింది మనువాదులేనని, ఇప్పుడు వారే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని మాజీ న్యాయమూర్తి, జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ''ఎస్సీ వర్గీకరణ – సుప్రీం కోర్టు తీర్పు – అమలు''అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందకుండా ప్రైవేట్ పరం చేశారన్నారు. దీంతో పేదలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఆమోదిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై పాలకవర్గాలు రెండు వర్గాల మధ్య వైరుధ్యాన్ని పెంచిపోషించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంటే మాదిగ మాల సామాజిక వర్గాల సమస్యగా చూస్తున్నారని అయితే ఇది మిగిలిన 57 ఉపకులాల సమస్య అనే విషయాన్ని విస్మరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, పీడీఎస్‌యూ అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి అల్లూరివిజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి ఫౌండేషన్ ఎండీని కఠినంగా శిక్షించాలి

కాచిగూడ: పెట్టుబడుల పేరుతో రూ.వెయ్యి కోట్ల మేరకు మోసగించిన ధన్వంతరి ఫౌండేషన్ ఎండీ కమలాకర్ శర్మను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ధన్వంతరీ ఫౌండేషన్ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధన్వంతరి ఫౌండేషన్ బాధితులు మంగళవారం కాచిగూడ నుంచి బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని సీసీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అగ్రిగోల్డ్ కుంభకోణం కంటే ఇది పెద్దదన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని బాధితులు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. ధన్వంతరిలో పెట్టుబడులు పెట్టి 3వేల మంది బాధితులు మోసపోయారని తెలిపారు. ఫౌండేషన్‌లో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఐఎఫ్‌ఎస్‌లను డైరెక్టర్లుగా నియమించుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అంబర్‌పేట చే–నంబర్ చౌరస్తాలో ధన్వంతరి ఫౌండేషన్ కార్యాలయాన్ని సీజ్ చేసి మూసివేయాలని డిమాండ్ చేశారు. మహిళా డైరెక్టర్ల బెయిల్‌ను రద్దు చేయాలన్నారు. సీసీఎస్ పోలీస్ అధికారులు వెంటనే కేసు చార్జిషీట్‌ను వేయాలని నగర పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.


సీసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న ధన్వంతరి ఫౌండేషన్ బాధితులతో గిరిప్రసాద్ శర్మ